సాక్షి ఖమ్మం

బుధవారం । 11 । జూన్ । 2025



ఇకపై తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు

మండలానికి మూడు చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేయనుండగా, జిల్లాలోని మధిర నియోజకవర్గాన్ని పైలట్‌గా ఎంపిక చేశారు. 8లో



పదును వచ్చాకే సాగు మేలు

సరైన వర్షపాతం నమోదై భూమి పదును ఎక్కాకే పత్తి విత్తనాలు నాటితే మొలక శాతం బాగుంటుందని శాస్త్రవేత్తలు సూచిస్తున్నారు. 8లో

గరిష్టం / కనిష్టం

35° / 25°

వాతావరణం

జిల్లాలో బుధవారం ఉదయం, సాయంత్రం ఎండ తీవ్రత తక్కువగా ఉంటుంది. మధ్యాహ్నం మాత్రం ఉష్ణోగ్రత పెరుగుతుంది.

న్యూస్‌రీల్

నేడు డిప్యూటీ సీఎం భట్టి, మంత్రి పొన్నం పర్యటన

ఖమ్మంవన్‌టౌన్/మధిర: రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క, రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ బుధవారం జిల్లాలో పర్యటించనున్నారు. ఉదయం 10–30గంటలకు ఖమ్మం ఎస్‌ఆర్‌అండ్ బీజీఎన్‌ఆర్ కళాశాల మైదానంలో అత్యవసర సమయాల్లో విద్యుత్ సిబ్బంది ఉపయోగించే విద్యుత్ అంబులెన్స్‌లను ప్రారంభిస్తారు. అనంతరం మధ్యాహ్నం రెండు గంటలకు మధిరలో రూ.8.50కోట్లతో నిర్మించే బస్ స్టేషన్ పనులకు డిప్యూటీ సీఎం, మంత్రి శంకుస్థాపన చేయనున్నారు.

క్లినికల్ శిక్షణకు 21వరకు దరఖాస్తులు

ఖమ్మం సహకారనగర్: ఇంటర్మీడియట్ ఎంఎల్‌టీ ఒకేషనల్ కోర్సులో 2020 నుంచి ఇప్పటివరకు ఉత్తీర్ణులైన విద్యార్థులకు ఏడాది పాటు ఖమ్మం ప్రభుత్వ ఆస్పత్రిలో క్లినికల్ శిక్షణ ఇవ్వనున్నట్లు జిల్లా ఇంటర్మీడియట్ విద్యాధికారి కె.రవిబాబు తెలిపారు. ఆసక్తి ఉన్న వారు ఈనెల 21వ తేదీ వరకు దరఖాస్తు చేసుకోవాలని, శిక్షణకు ఎంపికైన వారు రూ.వెయ్యి డీడీ సమర్పించాల్సి ఉంటుందని పేర్కొన్నారు. గతంలో దరఖాస్తు చేసుకుని ఎంపిక కాని వారు సైతం మళ్లీ దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. విద్యార్థినీ, విద్యార్థులు బయోడేటా, సర్టిఫికెట్ల జిరాక్స్‌లతో పాటు రూ.10పోస్టల్ స్టాంప్ అతికించిన సొంత చిరునామా కవర్‌ను కలెక్టరేట్‌లోని తమ కార్యాలయంలో అందజేయాలని డీఐఈఓ సూచించారు.

ముమ్మరంగా యూటీ నిర్మాణ పనులు



కొనసాగుతున్న యూటీ నిర్మాణ పనులు

కూసుమంచి: మునుపెన్నడూ లేని విధంగా గత ఏడాది సెప్టెంబర్‌లో పాలేరు రిజర్వాయర్‌కు 2లక్షల క్యూసెక్కుల మేర వరద చేరగా సాగర్ ఎడమ కాల్వపై కూసుమంచి మండలం హట్యాతండా వద్ద ఉన్న యూటీ(అండర్ టన్నెల్) కొట్టుకుపోయింది. దీంతో పాత యూటీని తొలగించి 77 మీటర్ల పొడవుతో కొత్తది నిర్మిస్తున్నారు. ఇది భారీ వరదలు వచ్చినా తట్టుకుంటుందని అధికారులు చెబుతున్నారు. నిర్మాణ పనుల్లో 120 మంది కార్మికులు రెండు షిఫ్ట్‌లుగా పనిచేస్తున్నారు. ఇటీవల పనులను పరిశీలించిన మంత్రి పొంగులేటి శ్రీనివాసరెడ్డి ఆదేశాలతో వానాకాలం పంటలకు నీరు ఇచ్చేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

రేపటి నుంచి యూడీఐడీ శిబిరాలు

ఖమ్మంవైద్యవిభాగం: దివ్యాంగుల వైకల్య శాతాన్ని నిర్ధారించి యూడీఐడీ(యూనిట్ డిజేబిలిటీ ఐడీ) కార్డులు జారీ చేసేందుకు ఈనెల 12 నుంచి 28వరకు క్యాంపులు నిర్వహిస్తున్నట్లు జిల్లా ప్రభుత్వ ఆస్పత్రి సూపరింటెండెంట్ కిరణ్‌కుమార్ తెలిపారు. జిల్లావ్యాప్తంగా దివ్యాంగులందరికీ ఖమ్మం ఆస్పత్రిలో పరీక్షలు నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఇందుకోసం దివ్యాంగులు మీ సేవ సెంటర్లు లేదా ఫోన్ ద్వారా స్లాట్ బుక్ చేసుకోవాలని తెలిపారు. క్యాంప్‌నకు హాజరయ్యే సమయాన స్లాట్ రశీదు, ఆధార్‌కార్డు జిరాక్స్, పాస్‌పోర్ట్ ఫొటో, వైద్యపరీక్ష నివేదికలో రావాలని సూచించారు. ఈ క్యాంపులు 12, 17, 19, 21, 24, 26, 28వ తేదీల్లో ఉదయం 9గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు జరుగుతాయని తెలిపారు.

కొనసాగుతున్న సర్టిఫికెట్ల పరిశీలన



సర్టిఫికెట్లు పరిశీలిస్తున్న ఉద్యోగులు

ఖమ్మం సహకారనగర్: బీఈడీ కళాశాలల్లో ప్రవేశానికి అభ్యర్థుల సర్టిఫికెట్ల పరిశీలన కొనసాగుతోంది. సోమవారం ఈ ప్రక్రియ ప్రారంభం కాగా... మంగళవారం 485మంది అభ్యర్థులు సర్టిఫికెట్లు పరిశీలనకు హాజరయ్యారు. ఈనెల 13వ తేదీ వరకు డైట్ కళాశాలలో కౌన్సెలింగ్ జరుగుతుందని ప్రిన్సిపాల్ సామినేని సత్యనారాయణ తెలిపారు. ఇందుకోసం ఆరు కౌంటర్ల ద్వారా 3,200మంది సర్టిఫికెట్లు పరిశీలించాల్సి ఉండగా, రోజుకు 650 మందికి అవకాశం కల్పించామని పేర్కొన్నారు. ఈకార్యక్రమంలో డైట్ అధ్యాపకులు, ఉద్యోగులు ఎస్.ప్రసాద్, బాలమురళి, పద్మ, ఎర్రమళ్ల శ్రీనివాసరావు, అమీర్‌ఖాన్, నవీన్, సందీప్ తదితరులు పాల్గొన్నారు.



ఖమ్మం రోటరీనగర్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల

పాఠశాలలు ముస్తాబు

ఈ విద్యా సంవత్సరం పాఠశాలల్లో పూర్తిస్థాయి వసతులు కల్పించేలా అధికారులు చర్యలు తీసుకున్నారు. జిల్లాలోని 955 పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాలల పథకం ద్వారా మరమ్మతు పనులు చేపట్టగా, ప్రభుత్వం రూ.35 కోట్లు కేటాయించింది. ఒకటీ, అర మినహా అదనపు తరగతి గదులు, ప్రహరీలు, టాయిలెట్ల నిర్మాణం పూర్తయింది. ఇక చాలా పాఠశాలల్లో విద్యుత్ సమస్య ఉండడంతో వైరింగ్ చేయించడమే కాక అవసరమైన చోట్ల భవనాలకు రంగులు వేయించారు. ఇక ప్రారంభం రోజున విద్యార్థులకు స్వాగతం పలికేలా పాఠశాలలను పూలు, తోరణాలతో అలంకరించనున్నారు.

బడి పిలుస్తోంది..

రేపటి నుంచి పాఠశాలలు పునఃప్రారంభం

- తొలిరోజే విద్యార్థులకు యూనిఫామ్, బుక్స్ పంపిణీ
- ఈ విద్యాసంవత్సరం 176 పాఠశాలల్లో ఏఐ బోధన
- మూతబడిన పాఠశాలలను తిరిగి ప్రారంభించనున్న కలెక్టర్

సాక్షి ప్రతినిధి, ఖమ్మం: వేసవి సెలవుల అనంతరం గురువారం కొత్త విద్యాసంవత్సరం ప్రారంభం కానుంది. ఈమేరకు ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు మొదటి రోజే పాఠ్య, నోట్ పుస్తకాలతోపాటు యూనిఫామ్ పంపిణీకి అధికారులు ఏర్పాట్లు చేశారు. అలాగే, విద్యార్థులకు సాంకేతికత ఆధారంగా పాఠాలు బోధించేలా 176 పాఠశాలల్లో ఈ ఏడాది ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానాన్ని ప్రవేశపెడుతున్నారు. కాగా, గతంలో మూతబడిన పాఠశాలల్లో బడిబాటతో విద్యార్థులను చేర్పించేలా కృషి చేస్తున్నారు. ఇందులో భాగంగా కల్లూరు మండలంలోని పాయపూర్, ఓబుల్‌రావు బంజర, లక్ష్మీపురం పాఠశాలల్లో విద్యార్థులను చేర్పించేందుకు నిర్వహించే బడిబాటలో బుధవారం పాల్గొననున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆయా బడులను పునఃప్రారంభిస్తారు.



బడిబాటలో పాల్గొన్న ఖమ్మం ఎన్నెస్పీకాలనీ ఉన్నత పాఠశాల బృందం

పుస్తకాలు, యూనిఫామ్ సిద్ధం

ప్రభుత్వ పాఠశాలల్లో తొలిరోజే విద్యార్థులకు పాఠ్య, నోట్ పుస్తకాలే కాక యూనిఫామ్ ఇచ్చేలా ఏర్పాట్లు చేశారు. జిల్లాకు 6,59,570 పాఠ్యపుస్తకాలు అవసరం ఉండగా.. పార్ట్ –1లో 4,92,970 పుస్తకాలు కావాల్సి ఉంది. ఇందులో ఇప్పటి వరకు 4,46,410 పుస్తకాలు జిల్లాకు చేరడంతో వీటిలో 3,76,918 పుస్తకాలను మండల కేంద్రాలకు చేర్చారు. ఇక నోట్ పుస్తకాలు 1,02,773 అవసరం ఉండగా.. 56,240 చేరాయి. అలాగే, మొత్తం 1,269 పాఠశాలల్లోని 69,241మంది విద్యార్థుల యూనిఫామ్ కోసం 2,95,420 మీటర్ల క్లాత్ అవసరం ఉండగా.. ఇప్పటికే గ్రామీణ స్థాయిలో స్వయం సహాయక సంఘాలు, మున్సిపాలిటీ, కార్పొరేషన్ పరిధిలో మెప్మా సిబ్బంది కుట్టడంలో నిమగ్నమయ్యారు. తొలిరోజు ఒక జత యూనిఫామ్ ఇచ్చేలా అధికారులు పర్యవేక్షిస్తున్నారు.

మరిన్ని స్కూళ్లలో ఏఐ బోధన

విద్యార్థులకు సాంకేతిక పరిజ్ఞానం ఆధారంగా బోధించేలా ప్రభుత్వం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్(ఏఐ) విధానాన్ని ప్రవేశపెట్టింది. గత ఏడాది ప్రయోగాత్మకంగా ఏడు పాఠశాలల్లో ఈ విధానాన్ని అమలుచేయగా విజయవంతం కావడంతో ఈ ఏడాది జిల్లాలోని 176 పాఠశాలల్లో ప్రవేశపెట్టడానికి నిర్ణయించారు. ఈ విధానంలో తెరపై చూస్తూ పాఠాలు వింటుండడంతో విద్యార్థులకు సులువుగా అర్థమవుతుందని.. చదవడంలో వెనుకబడిన వారు కూడా త్వరగా నేర్చుకుంటారని చెబుతున్నారు. అంతేకాక విద్యార్థులు ఇంగ్లిష్‌లో పట్టు సాధించేలా గత ఏడాది 34 పాఠశాలల్లో అమలుచేసిన 'ఉయ్ కెన్ లెర్న్' కార్యక్రమాన్ని ఈసారి 205 పాఠశాలల్లో ప్రవేశపెడుతున్నారు.

పండుగ వాతావరణంలో..



కొత్త విద్యాసంవత్సరాన్ని పండుగ వాతావరణంలో ప్రారంభించనున్నాం. మొదటిరోజే పాఠ్య, నోట్ పుస్తకాలు, యూనిఫామ్ ఇచ్చేలా ఏర్పాట్లుచేశాం. గతంలో మూతబడిన పాఠశాలలన్నీ తెరిచే ప్రయత్నాలు చేస్తున్నాం. బడి బాటకు మంచి స్పందన వస్తున్నందున ప్రవేశాలు పెరగనున్నాయి.

– సామినేని సత్యనారాయణ, జిల్లావిద్యాశాఖాధికారి

జిల్లాలో పాఠశాలలు, పుస్తకాలు, యూనిఫామ్ వివరాలు

మొత్తం పాఠశాలలు	విద్యార్థులు	కావాల్సిన మొత్తం పాఠ్యపుస్తకాలు
1,269	69,241	6,59,570

ప్రస్తుతం కావాల్సినవి (పార్ట్-1)	ఇప్పటి వరకు చేరినవి	మండల కేంద్రాలకు పంపినవి	అవసరమైన నోటుపుస్తకాలు	జిల్లాకు చేరినవి
4,92,970	4,46,410	3,76,918	1,02,773	56,240

భూసమస్యల పరిష్కారానికి కృషి

- రెవెన్యూ సదస్సును పరిశీలించిన కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్
- మహిళా సమాఖ్య ద్వారా ఇసుక పాయింట్‌పై ఆరా

చింతకాని: భూభారతి చట్టం ద్వారా భూసమస్యల పరిష్కారానికి అధికారులు చిత్తశుద్ధితో కృషి చేయాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ సూచించారు. చింతకాని మండలం వందనంలో మంగళవారం జరిగిన రెవెన్యూ సదస్సును పరిశీలించిన ఆయన ఏయే సమస్యలపై ఎక్కువ దరఖాస్తులు వస్తున్నాయని ఆరా తీశారు. అనంతరం మాట్లాడుతూ భూభారతి చట్టం ద్వారా ప్రతీ భూసమస్యకు పరిష్కారం లభిస్తుందనే అంశాన్ని దరఖాస్తుదారులకు వివరించాలని సూచించారు. కాగా, అసైన్డ్ భూములు కొనుగోలు చేసిన పేదలకు పట్టాలు జారీ చేస్తామని, లేదంటే ప్రభుత్వం స్వాధీనం చేసుకుంటుందని తెలిపారు. ఇందుకోసం త్వరలోనే కమిటీలు ఏర్పాటు కానున్నాయని ఆయన చెప్పారు. కాగా, భూములకు దారి సమస్యపై ఓ వ్యక్తి కలెక్టర్‌కు వివరించగా రెవెన్యూ కోర్టులో ఆర్డర్ పాస్ చేస్తామని భరోసా కల్పించారు. భూసమస్యలు త్వరగా పరిష్కారమయ్యేలా సర్వే కోసం సర్వేయర్లు అందుబాటులోకి రానున్నారని తెలిపారు. కాగా, ప్రతీ మండల కేంద్రంలో లైబ్రరీ ఏర్పాటుచేయనున్నట్లు వెల్లడించిన ఆయన, పంటల సాగుపై అధికారులు సలహాలు ఇస్తున్నారా, లేదా అని ఆరా తీశారు. అలాగే, ప్రభుత్వ పాఠశాలల్లో వసతులు, నాణ్యమైన విద్య అందుతున్నందున పిల్లలను చేర్పించాలని సూచించారు.

మహిళలు ఆదాయ మార్గాలు అన్వేషించాలి

అందుబాటులో ఉన్న వనరుల ద్వారా మహిళలు ఆదాయ మార్గాలను అన్వేషించాలని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ తెలిపారు. చింతకాని తహసీల్ వద్ద ఏర్పాటు చేసిన స్త్రీ టీ స్టాల్‌ను సందర్శించిన ఆయన వ్యాపారం వివరాలు తెలుసుకోవడంతో పాటు కాఫీ తాగి ఫోన్ పే ద్వారా డబ్బు చెల్లించారు. సీజన్‌కు అనుగుణంగా స్నాక్స్ విక్రయించాలని, యంత్రాంగం తరఫున సహకరిస్తామని తెలిపారు. కాగా, తహసీల్ ఎదుట స్త్రీ శక్తి భవన నిర్మాణానికి రూ.5 లక్షలు అవసరమని ఎంపీడీఓ చెప్పగా అక్కడికక్కడే చెక్కు జారీ చేసి నెలలోగా పనులు పూర్తిచేయాలని ఆదేశించారు.



భూభారతి సదస్సులో దరఖాస్తులపై ఆరా తీస్తున్న కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్



మున్నేరు వద్ద ఇసుక కూపన్లు పరిశీలిస్తున్న కలెక్టర్

ఇసుక అక్రమ రవాణాకు చెక్

మండలంలోని చిన్నమండవ మున్నేరు వద్ద సింధు గ్రామ సమాఖ్య ద్వారా ఏర్పాటు చేసిన ఇసుక పాయింట్‌ను పరిశీలించిన కలెక్టర్ నిర్వాహకులకు సూచనలు చేశారు. మహిళా సంఘాలపై ఉన్న నమ్మకంతో అప్పగించినందున కూపన్ ద్వారా మాత్రమే రవాణా జరిగేలా చూడాలని తెలిపారు. ఈసందర్భంగా సంఘం సభ్యుల వద్ద కూపన్లు, ట్రాక్టర్ జారీ చేసిన కూపన్‌ను పరిశీలించి జేసీబీలను అనుమతించొద్దని సూచించారు. తహసీల్దార్ కూరపాటి అనంతరాజు, ఎంపీడీఓ శ్రీనివాసరావు, ఐకేపీ ఏపీఎం శ్రీనివాసరావు, సింధు గ్రామ సమాఖ్య సభ్యులు బేబీరాణి, లక్ష్మి, ఇందిర, భాగ్యలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

నీటి సరఫరా ఎలా ఉంది?

జిల్లాలో పర్యటిస్తున్న ఢిల్లీ బృందం ఆరా

కూసుమంచి/ఖమ్మం అర్బన్: కేంద్ర గృహనిర్మాణ, అర్బన్ డెవలప్‌మెంట్ శాఖ జాయింట్ సెక్రటరీ, ఆర్థిక సలహాదారు సంజీత్ మంగళవారం జిల్లాలో పర్యటించారు. రెండు రోజుల పర్యటన నిమిత్తం వచ్చిన ఆయనతో పాటు పలువురు అధికారులు కూసుమంచి మండలం పాలేరులోని మిషన్ భగీరథ ప్రాజెక్టును పరిశీలించారు. ప్రాజెక్టు సామర్థ్యం, నీటి శుద్ధి, రోజువారీ సరఫరా, లబ్ధి పొందుతున్న గృహాల సంఖ్యను వారికి జిల్లా అధికారులు వివరించారు. ఆతర్వాత జీళ్లచెరువులోని నీటిశుద్ధి ప్లాంట్‌ను కూడా పరిశీలించారు. అలాగే, ఖమ్మంలోని పలు కాలనీల్లోనూ బృందం పర్యటించగా, 10వ డివిజన్ చైతన్యనగర్‌లో పలువురి ఇళ్లకు వెళ్లి నీటి సరఫరా తీరు, నాణ్యత వివరాలు నమోదు చేసుకున్నారు. ఈ కార్యక్రమాల్లో డీఆర్డీఓ సన్యాసయ్య, మిషన్ భగీరథ ఎస్‌ఈ శేఖర్‌రెడ్డి, ఈఈ వాణిశ్రీ, ఎంపీడీఓ వేణుగోపాల్‌రెడ్డి పాల్గొన్నారు.



జీళ్లచెరువు ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కేంద్ర అధికారులు

భారీగా ఆదాయం

- 2024-25లో 45,098 దస్తావేజుల రిజిస్ట్రేషన్
- ఉమ్మడి జిల్లా నుంచి రూ.264.17 కోట్ల రాబడి
- సంస్కరణలతో ఈ ఏడాది మరింత పెరిగే అవకాశం

ఖమ్మంమయూరిసెంటర్: ఉమ్మడి ఖమ్మం జిల్లాలో వ్యవసాయ భూములు, ఇళ్లు, ఖాళీ స్థలాలు, ప్లాట్ల రిజిస్ట్రేషన్ ద్వారా 2024–25 ఆర్థిక సంవత్సరంలో ప్రభుత్వానికి భారీగా ఆదాయం సమకూరింది. ఆదాయ మార్గాలను పెంచుకోవడంతో పాటు ప్రజలకు నాణ్యమైన సేవలందించేలా ప్రభుత్వం పలు మార్పులను తీసుకొస్తోంది. ఇందులో భాగంగా ఉమ్మడి జిల్లాల వారీగా వచ్చిన ఆదాయాన్ని ఎప్పటికప్పుడు పరిశీలిస్తోంది. ఈమేరకు ఉమ్మడి ఖమ్మం జిల్లాలో రిజిస్ట్రేషన్ల ద్వారా 2024–25లో రూ.264.17 కోట్లు ఆదాయం వచ్చినట్లు తాజాగా వెల్లడించింది.

45,098 డాక్యుమెంట్ల రిజిస్ట్రేషన్

స్టాంపులు, రిజిస్ట్రేషన్ల శాఖ ద్వారా ప్రభుత్వ ఖజానాకు గత ఏడాది భారీగానే ఆదాయం సమకూరింది. ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల పరిధిలో 2024–25 ఏడాదిలో 45,098 దస్తావేజుల రిజిస్ట్రేషన్ జరిగింది. ఇందులో 2,805 దస్తావేజులు ప్లాట్ల రిజిస్ట్రేషన్‌కు సంబంధించి ఉండగా 36.62 కోట్ల ఆదాయం సమకూరింది. అలాగే, 17,133 ఖాళీ స్థలాల రిజిస్ట్రేషన్‌తోరూ.73.07 కోట్లు, ఇళ్లకు సంబంధించి 25,160 దస్తావేజులతో రూ.101.61 కోట్ల ఆదాయం నమోదైంది. కాగా, వ్యవసాయ భూములకు సంబంధించి ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా రూ.56.78 కోట్ల ఆదాయం వచ్చింది. ఇందులో ఖమ్మం జిల్లా నుంచి రూ.53.1 కోట్లు, భద్రాద్రి జిల్లా నుంచి రూ.3.77 కోట్లు ఆదాయం సమకూరాయని వెల్లడించారు.

ఆదాయం మరింత పెంచుకునేలా..

ఉమ్మడి జిల్లాలోని 11 సబ్ రిజిస్ట్రార్ కార్యాలయాల్లో వ్యవసాయేతర భూములు, ఇళ్లు, అపార్ట్‌మెంట్ల ప్లాట్లకు సంబంధించి, తహసీల్దార్ కార్యాలయాల్లో వ్యవసాయ భూముల రిజిస్ట్రేషన్ చేస్తున్నారు. దస్తావేజుల రిజిస్ట్రేషన్లతో వచ్చే ఆదాయం మరింత పెరిగేలా ప్రభుత్వం పలు నిర్ణయాలు తీసుకుంటుంది. ఇప్పటికే స్లాట్ విధానంతో రిజిస్ట్రేషన్లు చేస్తుండగా, ఆధార్ ఈ–సంతకం విధానాన్ని ప్రయోగాత్మకంగా కూసుమంచి కార్యాలయంలో అమలు చేస్తున్నారు. అయితే, రిజిస్ట్రేషన్ సమయంలో ఎదురయ్యే ఇబ్బందుల దృష్ట్యా పలువురు గిఫ్ట్ రిజిస్ట్రేషన్లకు ముందుకు రావడం లేదు. ఈ విధానాన్ని ప్రభుత్వం సరళతరం చేస్తోంది. తద్వారా రిజిస్ట్రేషన్ల సంఖ్యలో పాటు ఆదాయం మరింత పెరుగుతుందని భావిస్తున్నారు.

విద్యార్థులకు నాణ్యమైన భోజనం

ఐటీడీఏ పీఓ రాహుల్ వెల్లడి

భద్రాచలంఅర్బన్ : గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు, పోస్ట్ మెట్రిక్ హాస్టళ్లలో చదువుతున్న గిరిజన విద్యార్థులకు చదువుతో పాటు నాణ్యమైన భోజనం అందిస్తామని ఐటీడీఏ పీఓ బి.రాహుల్ తెలిపారు. ఉమ్మడి జిల్లాలోని 50 ఆశ్రమ పాఠశాలలు, 14 వసతి గృహాలు, 22 పీఎంహెచ్ హాస్టళ్లకు కూరగాయలు, పండ్లు, చికెన్, కోడిగుడ్లు సరఫరా చేసేందుకు అందిన టెండర్లను వ్యాపారుల సమక్షాన భద్రాచలంలోని ఐటీడీఏ కార్యాలయంలో మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా పీఓ మాట్లాడుతూ.. 40మంది ఏజెన్సీదారులు టెండర్లు దాఖలు చేశారని, తక్కువ ధర కోట్ చేసిన వారినే ఆమోదించామని తెలిపారు. అనంతరం టెండర్‌దారులకు పలు సూచనలు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన నూతన మెనూ ప్రకారమే సరుకులు సరఫరా చేయాలని, వారం మొత్తానికి ఒకేసారి కాకుండా మూడుసార్లు అందించాలని సూచించారు. వారానికి ఐదు రోజులు అరటి పండ్లు, రెండు రోజులు ఇతర పండ్లు పంపిణీ చేయాలన్నారు. నాసిరకమైన సరుకులు సరఫరా చేసినట్లు ఫిర్యాదు అందితే చర్యలు తీసుకుంటా మని, తమ పరిధిలోని విద్యాసంస్థల్లో మూడేళ్ల పాటు టెండర్ దాఖలు చేయకుండా బ్లాక్ చేస్తామని హెచ్చరించారు. డీడీ మణెమ్మ, ఈఈ హరీష్, ఏసీఎంఓ రమేష్, ఏటీడీఓలు అశోక్ కుమార్, రాధమ్మతో పాటు హెచ్‌ఎంలు పాల్గొన్నారు.

ఎరువులకు కటకట

అన్నదాతలను కలవరపెడుతున్న కొరత

- సీజన్ వచ్చినా జిల్లాకు ఆశించిన స్థాయిలో చేరని నిల్వలు
- మరోపక్క వ్యవసాయ శాఖ అధికారుల్లోనూ హైరానా



ఖమ్మంలోని ఓ డీలర్ గోదాంలో ఎరువులు

ఖమ్మంవ్యవసాయం: జిల్లాలో ఎరువుల కొరత నెలకొందనే సమాచారం రైతాంగాన్ని కలవర పెడుతోంది. వానాకాలం సాగు సీజన్ ముంచుకొచ్చినా జిల్లాకు ఆశించిన స్థాయిలో నిల్వలు చేరలేదు. ఇప్పటికే కురిసిన వర్షాలతో రైతులు దుక్కులు చేయగా, మరో వర్షం కురిస్తే విత్తనాలు వేసేందుకు సిద్ధమవుతున్నారు. దుక్కితో పాటు విత్తు మొలకెత్తాక డీఏపీ, కాంప్లెక్స్, సింగిల్ సూపర్ పాస్పేట్ వంటి ఎరువులు వినియోగిస్తారు. ఇక పైరు ఎదుగుదలలో నత్రజని(యూరియా) ఎరువులను వాడతారు. జిల్లాలో ఈ వానాకాలం 7.32 లక్షల ఎకరాల్లో అన్నిపంటలు సాగు చేయనుండగా, రైతాంగానికి సరిపడా ఎరువులు లేవనే సమాచారంతో వారు ఆందోళన చెందుతున్నారు.

1.97 లక్షల మె. టన్నుల అవసరం

వానాకాలం పంటల సాగు విస్తీర్ణం ఆధారంగా జిల్లాలో 1.97 లక్షల మెట్రిక్ టన్నుల ఎరువులు అవసరమని వ్యవసాయ, ఉద్యాన శాఖలు ఇండెంట్ సమర్పించాయి. యూరియా 1,20,904.512 మె.టన్నులు, డీఏపీ 41,719.321, ఎంఓపీ 34,800.310 మె. టన్నుల అవసరం కాగా, యూరియా కేవలం 7,884.739, డీఏపీ 3,974.429, ఎంఓపీ 511.075 మెట్రిక్ టన్నులే నిల్వ ఉన్నాయి. వానాకాలం సాగు సీజన్ మే నుంచి సెప్టెంబర్ వరకు ఉంటుంది. ఈ సమయంలో అవసరమైన ఎరువులను నెలవారీ కోటాగా ప్రభుత్వం సమకూరుస్తుంది. కానీ ఇప్పుడు అలా సరఫరా కావడం లేదు. యూరియా కోటాను పరిశీలిస్తే మే నెలలో 831 మెట్రిక్ టన్నులకు గాను 419 టన్నులు, జూన్ నెలలో 4,153 టన్నులకు ఇప్పటివరకు కేవలం 1,973 టన్నులే సరఫరా అయింది.

గత ఏడాదితో పోలిస్తే మరీ తక్కువ

గత ఏడాది ఎరువుల నిల్వలతో పోలిస్తే ఈ ఏడాది పరిస్థితి మరీ దయనీయంగా ఉంది. గడిచిన యాసంగి సీజన్ నుంచి ఎరువుల సరఫరా గణనీయంగా తగ్గింది. అయినా అంతకు ముందు ఉన్న నిల్వలే కాక పాత నిల్వలు, గడ్డ కట్టిన యూరియా సైతం పంపిణీ చేసి సీజన్ వెళ్లదీశారు. జనవరి నుంచి సరఫరా మరింత తగ్గడంతో ఇబ్బందులు ఎదురు కాగా, పలుచోట్ల రైతులు ఆందోళనలు చేశారు. గత ఏడాది మే నెల నాటికి జిల్లాలో 77,377.907 మెట్రిక్ టన్నుల ఎరువులు నిల్వ ఉన్నాయి. ఈ ఏడాది మే నెలలో కేవలం 28,891.01 మెట్రిక్ టన్నుల ఎరువులే నిల్వ ఉండడం గమనార్హం. దీనికి తోడు ఖమ్మం, భద్రాద్రికొత్తగూడెం, మహబూబాబాద్ జిల్లాల కోసం ఖమ్మం స్టేషన్ కేంద్రంగా ఏర్పాటు చేసిన రేక్ పాయింట్‌ను పందిళ్లపల్లికి మార్చారు. ఈక్రమంలో కోడ్ కేటాయింపు ఆలస్యం కాగా జనవరి నుంచి ఏప్రిల్ వరకు ఎరువుల సరఫరా నిలిచిపోయింది. జిల్లాలో నిల్వలు తగ్గడానికి ఇదో కారణమని చెబుతున్నారు. ఇప్పుడు సాగు సీజన్ ప్రారంభమైనా సరిపడా ఎరువుల లభ్యత లేక వ్యవసాయ శాఖ అధికారులు హైరానా పడుతున్నారు. కాగా, రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు జిల్లా వాసి కావడంతో ఇక్కడ సమస్య రాకుండా ప్రత్యేక చర్యలు తీసుకుంటారని యంత్రాంగం, రైతులు భరోసా వ్యక్తం చేస్తుండగా.. ఎలాంటి ఫలితాలు రానున్నాయో వేచి చూడాలి.

నెల వారీగా జిల్లాకు అవసరమైన ఎరువుల వివరాలు (మెట్రిక్ టన్నుల్లో)

నెల	యూరియా	డీఏపీ	ఎంఓపీ	ఎన్‌పీకే	ఎస్ఎస్‌పీ
మే	831	265	209	888	68
జూన్	4,153	3,970	1,043	4,439	1,019
జూలై	12,460	6,616	3,129	13,317	1,698
ఆగస్టు	16,614	5,293	4,171	17,756	1,359
సెప్టెంబర్	20,767	1,323	5,214	22,195	340
మొత్తం	54,825	17,467	13,766	58,595	4,484

జిల్లాలో ప్రస్తుతం ఎరువుల నిల్వలు (మె. టన్నుల్లో)

ఎరువు	నిల్వ
యూరియా	7,884.739
డీఏపీ	3,974.429
ఎంఓపీ	511.075
ఎన్‌పీకే	14,148.52
ఎస్ఎస్‌పీ	1,912.63
కంపోస్టు	49.65
ఎఫ్‌ఓఎం	109.97
మొత్తం	28,591.013

బ్లాక్ మార్కెట్‌కు తరలింపు?

ఎరువుల కొరతను పసిగట్టిన వ్యాపారులు ఉన్న నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించేలా రంగం సిద్ధం చేసుకున్నారు. ఇప్పటికే పలువురు వ్యాపారులు సిండికేట్‌గా ఏర్పడినట్లు తెలిసింది. నిల్వలను బ్లాక్ మార్కెట్‌కు తరలించి అధిక ధరకు అమ్ముకోవాలనే ఆలోచనలో ఉన్నట్లు సమాచారం. అంతేకాక పర్యవేక్షించే యంత్రాంగాన్ని తమ దారికి తెచ్చుకున్నట్లు ప్రచారం జరుగుతోంది.

కొరత రాకుండా పర్యవేక్షణ



సాగు సీజన్‌కు ఎరువుల కొరత రాకుండా చూస్తాం. పంటల సాగు ఆధారంగా అవసరమైన ఎరువులను అందుబాటులో ఉంచేందుకు ప్రణాళిక రూపొందించాం. రైతులు కూడా విచ్చలవిడిగా ఎరువులు వినియోగించకుండా అవగాహన కల్పిస్తున్నాం. అలాగే, విక్రయాల్లో అక్రమాలు జరగకుండా నిఘా పెట్టాం.

– ధనసరి పుల్లయ్య, జిల్లా వ్యవసాయాధికారి

క్లుప్తంగా

క్రికెట్ టోర్నీ విజేత ఏన్కూరు



ట్రోఫీ అందుకుంటున్న ఏన్కూరు జట్టు

ఏన్కూరు: ఏన్కూరు ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రాంగణంలో పదిరోజులుగా నిర్వహిస్తున్న ఉమ్మడి జిల్లా స్థాయి క్రికెట్ టోర్నీ మంగళవారం ముగిసింది. ఈ పోటీల్లో వరుసగా ఏన్కూరు, కొణిజర్ల, నాచారం, ఏన్కూరు-2, గార్లఒడ్డు జట్లు మొదటి ఐదు స్థానాల్లో నిలిచాయి. ఈమేరకు విజేతలకు స్థానిక నాయకులు బహుమతులు అందజేశారు. కార్యక్రమంలో సొసైటీ చైర్మన్ శెట్టిపల్లి వెంకటేశ్వరావు, కాంగ్రెస్ నాయకులు సూరంపల్లి రామారావు, స్వర్ణ నరేందర్, భూక్యా లాలు, నర్సింహా రావు, కూరాకుల రమేష్, మేడ ధర్మారావు, వక్కంతుల నాగార్జున, లెనిన్ పాల్గొన్నారు.

నేడు ఏరువాక పౌర్ణమి

ఖమ్మంవ్యవసాయం: రైతుల పండుగ అయిన ఏరువాకను బుధవారం జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. వర్ష రుతువులో జేష్టశుద్ధ పూర్ణిమను అన్నదాతలు ఏరువాక పౌర్ణమిగా జరుపుకోవటం ఆనవాయితీగా వస్తోంది. ఇప్పటికే తొలకరి జల్లులు కురిసినందున రైతులు అరక దున్నుతూ సాగుపనులను ప్రారంభిస్తా రు. కాడెద్దులను కడిగి పసుపుకుంకుమ చల్లి అలంకరించడమే కాక పొలాలకు వెళ్లి దుక్కి దున్నుతారు. అయితే సాంకేతిక పెరిగిన నేపథ్యాన పలువురు ఎద్దులకు బదులు ట్రాక్టర్లను అలంకరించి పొలానికి వెళ్లడం మొదలైంది. అయితే ఈ ఏడాది అకాల వర్షాలు, ముందస్తు రుతుపవనాల కారణంగా కురిసిన వర్షాలకు రైతులు ఇప్పటికే దుక్కులు చేసుకొని పొలం పనులు ప్రారంభించారు. మిగతా వారు ఏరువాక పౌర్ణమి సందర్భంగా సంప్రదాయ పద్ధతుల్లో పనుల ప్రారంభానికి సిద్ధమవుతున్నారు.

యోగా ఉచిత శిక్షణ



యోగా శిక్షణలో డీవైఎస్ఓ, తదితరులు

ఖమ్మం స్పోర్ట్స్: ప్రపంచ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ఖమ్మంలోని సర్దార్ పటేల్ స్టేడియంలో ఏర్పాటుచేసిన ఉచిత యోగా శిక్షణ శిబిరాన్ని డీవైఎస్ఓ టి.సునీల్‌రెడ్డి మంగళవారం ప్రారంభించారు. జిల్లా యువజన క్రీడల శాఖ సహకారంతో కోదండరావు నేతృత్వాన పది రోజుల పాటు యోగా శిక్షణ ఇవ్వనున్నారు. ఈ సందర్భంగా డీవైఎస్ఓ మాట్లాడుతూ ప్రజలందరికీ ఉచితంగా శిక్షణ ఇవ్వడమే కాక స్టేడియంకు వచ్చే వారికి అవగాహన కల్పించున్నట్లు తెలిపారు. ఈకార్యక్రమంలో ఆర్.కృష్ణమూర్తి, టి.వెంకన్న, లక్ష్మీనారాయణ, ఎం.డీ.గౌస్ తదితరులు పాల్గొన్నారు.

పేకాట స్థావరంపై దాడి

తల్లాడ: మండలంలోని నారాయణపురం పాఠశాల వెనకాల పలువురు పేకాట ఆడుతున్నారనే సమాచారంతో పోలీసులు మంగళవారం దాడిచేశారు. ఈ సందర్భంగా నలుగురిలో ఇద్దరు పట్టుబడగా, ఇంకో ఇద్దరు పరారయ్యారు. ఘటనాస్థలంనుంచి రూ.3వేల నగదు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ వెంకటకృష్ణ తెలిపారు.

రూ.24 లక్షలకు ఐపీ దాఖలు

ఖమ్మం లీగల్: ఖమ్మం ఖిల్లా బజార్‌కు చెందిన షేక్ ఇలియాస్ ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో రూ.24 లక్షలకు దివాలా పిటిషన్(ఐపీ) దాఖలు చేశాడు. కొన్నేళ్లుగా పాత ఇనుము సామగ్రి వ్యాపారం చేస్తున్న ఆయన పలువురి అప్పులు చేశాడు. ఇప్పుడు తీర్చలేని పరిస్థితి ఎదురైందని 11మందిని ప్రతివాదులుగా చేరుస్తూ న్యాయవా ది ద్వారా ఖమ్మం సీనియర్ సివిల్ జడ్జి కోర్టులో మంగళవారం పిటిషన్ దాఖలు చేశాడు.

ఇకపై తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు



తెలంగాణ పబ్లిక్ స్కూల్‌గా రూపుదిద్దుకోనున్న రావినూతల హైస్కూల్

- మండలానికి మూడు చొప్పున ఏర్పాటు
- విద్యార్థులకు సెమీ రెసిడెన్షియల్ విధానంలో బోధన
- పైలట్ ప్రాజెక్ట్‌గా మధిర నియోజకవర్గంలో ఏర్పాటు

బోనకల్: ఓ వైపు కార్పొరేట్ పాఠశాలల తాకిడి, మరోవైపు యంత్రాంగం నిర్లక్ష్యంతో ప్రభుత్వ పాఠశాలలు కునారిల్లుతున్నాయి. కొన్నేళ్ల తర్వాత ప్రభుత్వ పాఠశాలల మనుగడ సాధ్యమేనా అనే సందేహాలు వ్యక్తమవుతున్న నేపథ్యాన స్కూళ్లను పటిష్టం చేసేలా ప్రభుత్వం మార్పులకు శ్రీకారం చుడుతోంది. ఇప్పటికే ఉన్న పాఠశాలలను మండలానికి ఒకటి చొప్పున తెలంగాణ పబ్లిక్ స్కూల్'(టీపీఎస్)గా మార్చి అక్కడి విద్యార్థులతో పాటు సమీప గ్రామాల్లోని వారికి ప్రవేశాలు కల్పిస్తారు. వీరికి ఉదయం అల్పాహారం, మధ్యాహ్న భోజనం, సాయంత్రం స్నాక్స్ సమకూరుస్తూ సెమీ రెసిడెన్షియల్ విధానంలో బోధించాలని నిర్ణయించారు. ఇందుకోసం మధిర నియోజకవర్గాన్ని పైలట్ ప్రాజెక్టుగా ఎంపిక చేశారు.

ప్రతీ మండలంలో...

తెలంగాణ పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటుకు డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్క ప్రాతినిధ్యం వహిస్తున్న మధిర నియోజకవర్గాన్ని పైలట్‌గా ఎంపిక చేశారు. ఈ నియోజకవర్గంలోని ఐదు మండలాల్లో కొత్త విధానం అమలుచేస్తారు. కొత్త విద్యావిధానంతో మండలానికి మూడు చోట్ల తెలంగాణ పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటు చేసి 4నుంచి 10వ తరగతి వరకు డిజిటల్ విధానంలో పాఠాలు బోధిస్తారు.

ఎక్కడెక్కడంటే...

పబ్లిక్ స్కూళ్లను బోనకల్ మండలంలోని రావినూతల, చిరునోముల, కలకోట గ్రామాల ఉన్నత పాఠశాలల్లో ఏర్పాటుచేస్తారు. రావినూతల పబ్లిక్ స్కూల్‌కు ఆ గ్రామంతో పాటు జానకీపురం, గోవిందాపురం(ఎల్) గ్రామాల విద్యార్థులకు ప్రవేశాలు ఉంటాయి. అలాగే, చిరునోముల పబ్లిక్ స్కూల్‌కు స్థానికులే కాక ముష్టికుంట్ల, బోనకల్ విద్యార్థులు, కలకోట పబ్లిక్ స్కూల్‌కు స్థానిక విద్యార్థులతో పాటు ఆళ్లపాడు, బ్రాహ్మణపల్లి, మోటమర్రి విద్యార్థులను చేర్పిస్తారు. ఇక ఎర్రుపాలెం మండలంలో జమలాపురం, బనిగండ్లపాడు, మీనవోలు ఉన్నత పాఠశాలలు, మధిర మండలంలో సిరిపురం, మహదేవపురం, ప్రభుత్వ జూనియర్ కళాశాల, చింతకాని మండలంలో పందిళ్లపల్లి, లచ్చగూడెం, నాగులవంచ పాఠశాలలు, ముదిగొండ మండలంలో ముదిగొండ, ముత్తారం, పెద్దమండువ ఉన్నత పాఠశాలలలో పబ్లిక్ స్కూళ్లు ఏర్పాటుచేస్తారు.

ఆ స్కూళ్లు అలాగే..

పబ్లిక్ స్కూల్ ఏర్పాటుచేసి సమీప గ్రామాల్లోని విద్యార్థులకు ప్రవేశాలు కల్పించినా అక్కడి పాఠశాలలను యథావిధిగానే కొనసాగిస్తారు. పబ్లిక్ స్కూల్‌లో చేరేందుకు ఆసక్తి ఉన్న వారికి ప్రవేశాలు కల్పించి మిగతా వారికి పాత స్కూల్‌లోనే బోధిస్తారు. కాగా, పబ్లిక్ స్కూళ్ల నిర్వహణ కోసం ఇప్పటికే గుర్తించిన పాఠశాలలో సర్వే పూర్తిచేశారు. ఫర్నీచర్, ఇతర సౌకర్యాల కల్పనకు ముందుగా రూ.50లక్షల చొప్పున నిధులు అవసరమని అధికారులు ప్రతిపాదించారు. ఈ ఏడాది కొంత మేర, వచ్చే ఏడాదికల్లా మిగతా పనులన్నీ పూర్తిచేయనున్నారు. ఉదయం 8నుంచి సాయంత్రం 5గంటల వరకు సెమీ రెసిడెన్షియల్ విధానంలో బోధన సాగనుంది.

ఆ తర్వాత...

పబ్లిక్ స్కూళ్ల ఏర్పాటు తర్వాత ప్రాథమిక విద్యను బలోపేతం చేసేలా ఆ స్థాయిలో కూడా ఫౌండేషన్ స్కూళ్లు ఏర్పాటు చేస్తారు. ఇందుకుగాను బోనకల్ మండలంలో కలకోట, చిన్నబీరవల్లి, లక్ష్మీపురం, బోనకల్, ముష్టికుంట్ల ప్రాథమిక పాఠశాలలను ఎంపిక చేశారు. అంతేకాక మిగతా మండలాల్లోనూ ఐదు పాఠశాలలను తీర్చిదిద్ది ప్రీ ప్రైమరీ నుంచి 3వ తరగతి వరకు బోధిస్తారు. కాగా, కార్పొరేట్ పాఠశాలల స్థాయిలో విద్యార్థులు గ్రామాల నుంచి వచ్చేలా బస్సు సౌకర్యం కూడా కల్పించనున్నారు.

ప్రభుత్వ విద్య బలోపేతం..



ప్రభుత్వ విద్యారంగాన్ని బలోపేతం చేసేలా ప్రభుత్వం తెలంగాణ పబ్లిక్ స్కూళ్లను ఏర్పాటు చేస్తోంది. ప్రైవేట్ స్కూళ్లకు దీటుగా సౌకర్యాలు కల్పించడంతో పాటు బోధన ఉంటుంది. తద్వారా అందరికీ విద్యాప్రమాణాలపై భరోసా ఏర్పడుతుంది.

– దామాల పుల్లయ్య, ఎంఈఓ, బోనకల్

42శాతం రిజర్వేషన్ కావాల్సిందే..



సదస్సులో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ మల్లన్న, పక్కన నాయకులు

- త్వరలోనే బీసీల పార్టీ ఏర్పాటు
- బహుజన రాజ్యాధికార సదస్సులో ఎమ్మెల్సీ మల్లన్న

ఖమ్మం మామిళ్లగూడెం: ఎట్టి పరిస్థితుల్లోనూ బీసీలకు 42శాతం రిజర్వేషన్ కల్పించాల్సిందేనని ఎమ్మెల్సీ చింతపండు నవీన్ అలియాస్ తీన్మార్ మల్లన్న డిమాండ్ చేశారు. ఖమ్మంలో మంగళవారం జరిగిన బహుజన రాజ్యాధికార సదస్సులో ఆయన మాట్లాడారు. రాష్ట్రంలో ఒక్క బీసీ ఎమ్మెల్యే కూడా లేని జిల్లా ఖమ్మమేనని, ఇక్కడ జనరల్ స్థానాల్లోనూ బీసీలకు అవకాశం ఇవ్వలేదని పేర్కొన్నారు. కాగా, బీసీ రిజర్వేషన్ విషయంలో పాలకులు కుంటి సాకులు చెబుతున్నారని, రిజర్వేషన్లను కేంద్రం ఆమోదించాలనడం సరికాదని తెలిపారు. రాష్ట్రంలోని పలు గ్రామాల్లో బీసీ కుటుంబాలను వెలివేసిన ఘటనలు ఉన్నా అగ్ర కులాల వారిని వెలివేయడం చూడలేదని చెప్పారు. ఒక్కప్పుడు దేశంలోని గొప్ప విద్యాలయాలకు ప్రపంచ దేశాల విద్యార్థులు వస్తే, అగ్రకుల పాలకులు విద్య, వైద్యాన్ని వ్యాపారంగా మార్చి బీసీలు, పేదలకు దూరం చేశారని మల్లన్న మండిపడ్డారు. ఇవన్నీ సరిదిద్దాలంటే రాష్ట్రంలో బీసీ రాజ్యం రావాల్సిందేనని స్పష్టం చేశారు. అందుకే అగ్రవర్ణ కులాలకు వ్యతిరేకంగా బీసీల పార్టీ ఏర్పాటు చేస్తామని, కలిసొచ్చేందుకు ఉద్యమకారులు సిద్ధంగా ఉన్నారని తెలిపారు. తద్వారా బీసీ నాయకులకు అవకాశం దక్కి, బీసీ సర్కార్ ఏర్పడుతుందని మల్లన్న ధీమా వ్యక్తం చేశారు. ఇంకా ఈ సదస్సులో జస్టిస్ చంద్రకుమార్, బీసీ నాయకులు గుండాల కృష్ణ, పాల్వంచ రామారావు, టీ.వీ.రాజు, రాంబాబు, పి.విజయ్‌కుమార్, నాసరయ్య, లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు. కాగా, ప్రైవేట్ విద్యాసంస్థల్లో ఫీజుల దోపిడీని అరికట్టేలా చట్టం చేయించాలని పీడీఎస్‌యూ నాయకులు ఎమ్మెల్సీ మల్లన్నకు వినతిపత్రం అందజేశారు. నాయకులు వినయ్, సందీప్, ప్రసాద్, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌లో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

భద్రాచలంఅర్బన్: రాష్ట్రంలోని రెండు గిరిజన గురుకుల జూనియర్(పీవీటీజీ ఆదిమ గిరిజన తెగలు) కళాశాలల్లో ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు భద్రాచలం ఐటీడీఏ పీఓ రాహుల్ తెలిపారు. హైదరాబాద్ హయత్‌నగర్‌లో పీవీటీజీ-సీఓఈ(బాలురు, బాలికలు) గురుకులాలు ఉన్నాయని పేర్కొన్నారు. ఉమ్మడి ఖమ్మం జిల్లా నుంచి కొండ రెడ్డి, చెంచు, కొలం, తోటి, కోలావర్ తెగకు చెంది 2024–25 విద్యాసంవత్సరంలో పదో తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థినీ, విద్యార్థులు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. సీటు లభించిన వారికి ఉచిత బోధన, భోజనంతో పాటు పాఠ్య, నోట్‌పుస్తకాలు, యూనిఫామ్, నైట్ డ్రెస్సులు, స్పోర్ట్స్ డ్రెస్సులు, షూస్‌తో పాటు కాస్మోటిక్ చార్జీలు చెల్లిస్తారని పేర్కొన్నారు. అంతేకాక జేఈఈ మెయిన్స్, అడ్వాన్స్‌డ్, నీట్, ఎప్‌సెట్, లాసెట్, సీయూ సెట్శిక్షణ ఉంటుందని పేర్కొన్నారు. ఆసక్తి ఉన్న వారు ఖమ్మం రీజియన్ ప్రాంతీయ సమన్వయ అధికారి కార్యాలయంలో ఈనెల 16లోగా దరఖాస్తులు సమర్పించాలని, వివరాలకు 99497 23291, 94403 98993, 83099 31449 నంబర్లలో సంప్రదించాలని పీఓ సూచించారు.

విద్య, ఉద్యోగాలపై ప్రశ్నించకుండా కుయుక్తులు

డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు రమేష్



సభలో మాట్లాడుతున్న నున్నా నాగేశ్వరరావు

ఖమ్మంమయూరిసెంటర్: విద్య, ఉద్యోగాలపై యువత ప్రశ్నించకుండా పాలకులు వారిని మత్తుకు బానిసలుగా చేస్తున్నారని డీవైఎఫ్ఐ రాష్ట్ర అధ్యక్షుడు కోట రమేష్ విమర్శించారు. ఈమేరకు మాదకద్రవ్యాలు, బెట్టింగ్ యాప్స్ నిర్మూలనకు తాము చేస్తున్న పోరాటంలో అందరూ కలిసి రావాలని పిలుపునిచ్చారు. సంఘం జిల్లా కమిటీ ఆధ్వర్యాన 'చెడు వ్యసనాలు వద్దు – పోరాటాలే ముద్దు' నినాదంతో 12 రోజుల పాటు చేపట్టిన యువచైతన్య యాత్ర ముగింపు సభ మంగళవారం ఖమ్మంలోని బోస్ బొమ్మ సెంటర్‌లో నిర్వహించారు. ఈ సందర్భంగా రమేష్ మాట్లాడుతూ సమాజానికి పెనుముప్పుగా ఉన్న మాదక ద్రవ్యాలు, మద్యపానం, ఆన్‌లైన్ బెట్టింగ్ యాప్స్ నిర్మూలనకు పోరాడాలని కోరారు. అలాగే, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు యువత, నిరుద్యోగులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలని డిమాండ్ చేశారు. అనంతరం డాక్టర్ యలమంచిలి రవీంద్రనాథ్, సీపీఎం జిల్లా కార్యదర్శి నున్నా నాగేశ్వరరావు, ఖమ్మం త్రీటౌన్ ఎస్ఐ కొండల్‌రావు యాత్ర ఉద్దేశాన్ని అభినందించారు. కార్యక్రమంలో డీవైఎఫ్ఐ జిల్లా కార్యదర్శి షేక్ బషీరుద్దీన్, సీపీఎం ఖమ్మం డివిజన్ కార్యదర్శి వై.విక్రమ్, నాయకులు యర్రా శ్రీనివాసరవు, ఎం.ఏ.జబ్బార్, మద్దాల ప్రభాకర్ పాల్గొన్నారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి



వెంకటేశ్వర్లు (ఫైల్)

రఘునాథపాలెం: రఘునాథపాలెంకు చెందిన కిరాణం వ్యాపారిమేకవెంకటేశ్వర్లు (48) రోడ్డుప్రమాదంలో గాయ పడగా చికిత్సపొందుతూ మంగళవారం మృతిచెందా డు. ఈనెల 5న కిరాణంసామగ్రి కోసం బైక్‌పై ఆయన రఘునాథపాలెం స్టేజీ వైపునకు వెళ్తుండగా ఎదురుగా వచ్చిన ఆటో ఢీకొట్టింది. ఈ ప్రమాదంలో తలకు బలమైన గా యమైన వెంకటేశ్వర్లును ఆస్పత్రికి తరలించి చికిత్సచేయిస్తుండగా మృతిచెందాడు. వెంకటేశ్వర్లుకు భార్య, ఇద్దరు కుమారులు ఉండగా, కేసు నమోదు చేసినట్లు సీఐ ఉస్మాన్‌షరీఫ్ తెలిపారు.

కుమారుడి కళ్లెదుటే తండ్రి..



హరికృష్ణ (ఫైల్)

నేలకొండపల్లి: ఈత కొట్టేందుకు వెళ్లిన వ్యక్తి ప్రమాదవశాత్తు వ్యవసాయ బావిలో మునగగా కుమారుడి కళ్లెదుటే మృతి చెందాడు. మండలంలోని రాజేశ్వరపురానికి చెందిన రెడ్డబోయిన హరికృష్ణ(32) తనకుమారుడు శివరామ్ ను తీసుకుని మంగళవారం గ్రామంలోని వ్యవసాయ బావిలో ఈత కొట్టేందుకు వెళ్లాడు. తొలుత హరికృష్ణ బావిలో దూకగా, కుమారుడిని కూడా రమ్మన్నాడు. కానీ కుమారుడు భయంతో గట్టుపైనే ఉండగా ఈత కొడుతు న్న హరికృష్ణ కాసేపటికి నీటమునిగి మృతిచెందాడు. శివరామ్ ఇచ్చిన సమాచారంతో కుటుంబీకులు, స్థానికులు చేరుకుని ఆయన మృతదేహాన్ని బయటకు తీశారు.

గడ్డి మందు తాగిన వ్యక్తి..

నకిరేకల్: మద్యం మత్తులో గడ్డి మందు తాగిన వ్యక్తి చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. ఖమ్మం రూరల్ మండలం అరెంపులకు చెందిన వల్లురు భూపాల్‌రెడ్డి(52)కి నకిరేకల్ మండలం మండలాపురం గ్రామానికి చెందిన జానకితో వివాహమైంది. గతేడాది నుంచి భూపాల్‌రెడ్డి మండలాపురంలో అత్తగారింట్లోనే భార్యతో కలిసి ఉంటున్నాడు. వీరికి ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. మద్యానికి బానిసైన భూపాల్‌రెడ్డి ఈనెల 8న తన అత్తగారి నిమ్మతోటలో మత్తులోనే గడ్డి మందు తాగగా, ఇంటికి వచ్చి విషయాన్ని చెప్పాడు. అప్పటికే అపస్మారకస్థితికి చేరిన ఆయనను కుటుంబీకులు నకిరేకల్‌కు, అక్కడి నుంచి నల్లగొండ, ఆపై హైదరాబాద్ తరలించగా చికిత్స పొందుతూ మంగళవారం మృతిచెందాడు. ఆయన భార్య ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ కృష్ణమాచారి తెలిపారు.

శుభకార్యాలకు విరామం

- మళ్లీ జూలై 26నుంచే ముహూర్తాలు

ఖమ్మంగాంధీచౌక్: గురు మూఢమి మంగళవారం మొదలుకావడంతో శుభకార్యాలకు బ్రేక్‌పడింది. ఆ తర్వాత ఆషాఢ మాసం రానుండడంతో జూలై 25 వరకు ఎలాంటి ముహూర్తాలు లేవు. ఈ ఏడాది సంక్రాంతి తర్వాత నుంచి జూన్ మొదటి వారం వరకు పెద్దసంఖ్యలో వివాహాలు, ఇతర శుభకార్యాలు జరిగాయి. ప్రస్తుతం గురుమూఢమి, ఆషాఢం కారణంగా ముహూర్తాలు ఉండవు. ఆ తర్వాత జూలై 26 నుంచి శ్రావణమాసం మొదలుకానుండగా వివాహాలు, గృహప్రవేశాలు,శంకుస్థాపనలు, ఇతర శుభకార్యాలకు మంచి ముహూర్తాలు ఉంటాయని పండితులు తెలిపారు. ఈ ఏడాది శ్రావణమాసం తర్వాత అక్టోబర్ నెలలో శుభ ముహూర్తాలు ఉన్నాయని పేర్కొన్నారు. జూలై 26, 30, 31వ తేదీల్లో, ఆగస్టు 1, 3, 5, 6, 7, 8, 9, 10, 12, 13, 14, 17, సెప్టెంబర్ 23, 24, 26, 27, 28, అక్టోబర్ 1, 2, 3, 4, 7, 8, 10, 11, 12, 16, 17, 22, 23, 24, 26, 28, 29,30, 31, నవంబర్ 1, 2, 4, 7, 12, 13, 14, 15, 22, 23, 25, 26, 27వ తేదీల్లో ముహూర్తాలు ఉన్నట్లు పండితులు చెబుతున్నారు.

వేంసూరు ఉపాధ్యాయుడికి సన్మానం



రాంబాబును సన్మానిస్తున్న డీఈఓ, అధికారులు

ఖమ్మం సహకారనగర్: ఇటీవల రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ అవార్డు అందుకున్న వేంసూరు జెడ్పీహెచ్ఎస్ పాఠశాల ఉపాధ్యాయుడు రాంబాబును డీఈఓ సామినేని సత్యనారాయణ సన్మానించారు. ఖమ్మంలో ఆయన మంగళవారం డీఈఓను కలవగా సన్మానించి మాట్లాడారు. ప్రపంచ పర్యావరణ దినోత్సవం సందర్భంగా తెలంగాణ కాలుష్య నియంత్రణ బోర్డు ఆధ్వర్యాన రాష్ట్రస్థాయి గ్రీన్ చాంపియన్ పురస్కారం అందుకోవడం అభినందనీయమన్నారు. ఈకార్యక్రమంలో డీఎస్ఓ దుస్సా జగదీశ్వర్, సీఎంఓ యలగందుల రాజశేఖర్, హెచ్‌ఎం నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

పదును వచ్చాకే సాగు మేలు

- వర్షం పడ్డాక పత్తి విత్తనాలు నాటితే మంచి ఫలితం
- రైతులకు కేవీకే శాస్త్రవేత్తల సూచనలు



పత్తి విత్తనాలు నాటుతున్న కూలీలు

వైరా: వాతావరణ శాఖ జారీ చేసే వర్షసూచనల ఆధారంగా ముందుకు సాగుతూ పంటల సాగు పనులు చేపడితే మంచి ఫలితం ఉంటుందని వైరా కృషి విజ్ఞాన కేంద్రం కోర్డినేటర్ డాక్టర్ కె.రవికుమార్ సూచించారు. అంతేకాక సరైన వర్షాలు కురిసి భూమి పదును ఎక్కాకే పత్తి విత్తనాలు నాటాలని, తద్వారా మొలక శాతం బాగుంటుందని ఆయన తెలిపారు. ఈమేరకు జిల్లా రైతులకు కోఆర్డినేటర్ పలు సూచనలు చేశారు.

పొడి దుక్కుల్లో వద్దు...

జిల్లాలో సాగయ్యే ప్రధాన పంటల్లో పత్తి ఒకటి. ఈ పంటను జిల్లాలో గతేడాది 1.87 లక్షల ఎకరాల్లో సాగు చేయగా ఈసారి ఇంకాస్త పెరగొచ్చని భావిస్తున్నారు. అయితే, కొద్దిరోజుల నుంచి అడపాదడపా కురుస్తున్న వర్షాలతో పలువురు రైతులు పొడి దుక్కుల్లోనే పత్తి విత్తనాలు నాటుతున్నారు. ఇలా చేశాక వర్షాలు కురవకపోగా మొలకశాతం తగ్గే ప్రమాదముందని కేవీకే కోర్డినేటర్ తెలిపారు.

ఈ సూచనలు పాటించండి

- పత్తి విత్తనాలను ఈనెలతో పాటు జూలై నెలలోనూ విత్తుకోవచ్చు. వర్షపాతం ఆధారంగా జూలై 20వ తేదీ వరకు పత్తి విత్తనాలు వేసే అవకాశముంది. అందువల్ల ఒకటి, రెండు తేలికపాటి వర్షాలు పడగానే తొందరపడొద్దు. కనీసం 60 మి.మీ. వర్షపాతం నమోదయ్యాకే విత్తనాలు నాటితే వంద శాతం మొలక వస్తుంది. అలాగే, రైతులు తమ ప్రాంతానికి అనువైన బీటీ విత్తనాలను అనుభవంపై ఎంచుకోవాలి. ఒకే రకం కాకుండా రెండు, మూడు రకాల విత్తనాలు నాటడం మంచిది. బీటీ విత్తనాలు ఎంపిక చేసుకుంటే మేలైన యజమాన్య పద్ధతులు పాటించాలి. నేల స్వభావం ఆధారంగా 40 లేదా 42 అంగుళాల అచ్చు వేసుకుని విత్తితే మంచి దిగుబడి వస్తుంది. తేలిక నేలల్లోనైతే అధిక సాంద్రత పద్ధతిలో 36 – 6 అంగుళాల దూరంలో లేదా దగ్గరగా సాగు(సీఎస్) చేసే పద్ధతి అయితే 36
- 12 అంగుళాల దూరంలో విత్తుకోవాలి. ఇందుకోసం అనువైన వంగడాలు ఎంచుకుంటే మంచి దిగుబడి రావడమే కాక రెండో పంట కూడా సాగు చేయొచ్చు. కాగా, పత్తి గింజలు నాటాక 48 గంటల్లో తేమ ఉంటే పెండి మిథాలిన్ 1.2 లీటర్లను ఎకరాకు పిచికారీ చేస్తే కలుపు ఉధృతి తగ్గుతుంది.

జ్యేష్టాభిషేకానికి అంకురార్పణ



నదీ జలాన్ని తీసుకొస్తున్న అర్చకుడు

భద్రాచలంటౌన్: భద్రాచలంలోని శ్రీసీతారామచంద్ర స్వామివారి దేవస్థానంలో బుధవారం జరగనున్న జ్యేష్టాభిషేకానికి మంగళవారం అంకురార్పణ చేశారు. ఈ సందర్భంగా మేళతాళాలు, మంగళవాయిద్యాల నడుమ పవిత్ర గోదావరి నుంచి అర్చకులు తీర్థబిందె తీసుకొచ్చారు. జ్యేష్ఠ పౌర్ణమి (ఏరువాక పౌర్ణమి)ని పురస్కరించుకుని రామాలయంలో ప్రతీ ఏటా ఈ కార్యక్రమం నిర్వహించడం ఆనవాయితీగా వస్తోందని అర్చకులు తెలిపారు. బేడా మండపంలో 81 కలశాలలో సమస్త నదీ జలాలను ఆవాహన చేసి స్వామివారికి అభిషేకం చేస్తామని, ఈ సందర్భంగా నిత్యకల్యాణం రద్దు చేశామని వారు వివరించారు.

లక్ష్యం నెరవేరేనా?

- ప్రస్తుతం బడి బాటతో కలిపే హాస్టల్ బాట
- ప్రత్యేకంగా నిర్వహిస్తేనే ప్రవేశాలు పెరుగుతాయని చర్చ

ఖమ్మంమయూరిసెంటర్: జిల్లాలో పాఠశాలలు గురువారం తెరుచుకోనున్నాయి. ఈనేపథ్యాన ఉపాధ్యాయులు బడి బాట నిర్వహిస్తుండగా, సంక్షేమ శాఖల ఆధ్వర్యాన హాస్టల్ బాట కూడా వేగవంతం చేశారు. గతంలో విడిగా నిర్వహించిన ఈ కార్యక్రమాన్ని ఈసారి బడి బాటతోనే కలిపి కొనసాగిస్తుండగా, భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. హాస్టల్ బాటను విడిగా నిర్వహిస్తేనే ప్రవేశాలు పెరుగుతాయని చాలామంది అభిప్రాయపడుతున్నారు. వసతిగృహంలో చేరే విద్యార్థుల నివాసం ఆరు కిలోమీటర్ల పరిధిలో ఉండాలి. అంతే తప్ప సొంత గ్రామం వారు హాస్టల్‌లో చేరడానికి నిబంధనలు అడ్డంకిగా ఉన్నాయి. ఈనేపథ్యాన బడిబాటలో పాల్గొంటున్న హాస్టళ్ల అధికారులు ప్రవేశాలు ఎలా పెరుగుతాయని ఆందోళన చెందుతున్నారు.

రెండూ కలిపి ఎందుకంటే..

విద్యా హక్కుచట్టం అమల్లోకి వచ్చాక ఆరు నుంచి పదో తరగతి వరకు విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగింది. దీనికి తోడు ఆర్థికంగా, సామాజికంగా వెనుకబడిన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించాలనే లక్ష్యంతో ప్రభుత్వం సంక్షేమ హాస్టళ్లను నిర్వహిస్తోంది. ఈ హాస్టళ్లలో ఎక్కువ మంది చేరేలా హాస్టల్ బాట కార్యక్రమాన్ని రూపొందించారు. గతంలో ఈ కార్యక్రమాన్ని వేసవి సెలవుల అనంతరం పాఠశాలలు తెరిచే ముందు నిర్వహించగా, ఈసారి బడిబాటతో కలిపే నిర్వహిస్తున్నారు. బడిబాట ద్వారా ఉపాధ్యాయులు ఇంటింటికీ వెళ్తుండగా, ఇదే సమయాన అర్హులైన విద్యార్థులు హాస్టళ్లలో చేరేలా ప్రోత్సహిస్తున్నారు. వనరులను సమర్థవంతంగా వినియోగించుకునేందుకే రెండూ కలిపి నిర్వహిస్తున్నామని చెబుతున్నారు.

ఫలితం ఉంటుందా?

కొత్త విధానంపై జిల్లాలో చర్చ జరుగుతోంది. చాలామంది విద్యావేత్తలు, సామాజిక కార్యకర్తలు, తల్లిదండ్రులు హాస్టల్‌బాట విడిగా నిర్వహించాలని సూచిస్తున్నారు. హాస్టళ్లలో ఉండే సౌకర్యాలు, వసతులు, భోజనం, పర్యవేక్షణ వంటి విషయాలను తల్లిదండ్రులకు తెలియజేయాల్సి ఉన్నందున బడిబాటతో పాటే నిర్వహిస్తుండడంతో అధికారులకు తగిన సమయం లభించడం లేదని చెబుతున్నారు. ఈనేపథ్యాన హాస్టళ్లలో ప్రవేశాల పెంపునకు ప్రత్యేకంగా ప్రచారం చేయాలని సూచిస్తున్నారు.



తిరుమలాయపాలెం ఉపాధ్యాయులతో కలిసి బడిబాటలో పాల్గొన్న హాస్టళ్ల అధికారులు

సమావేశాలతోనే..

కొందరు తల్లిదండ్రులు తమ పిల్లలను హాస్టళ్లలో చేర్పడానికి సంకోచిస్తుంటారు. అక్కడ భద్రత, పర్యవేక్షణపై పూర్తి విశ్వాసం కల్పిస్తేనే ముందుకొచ్చే అవకాశముంది. ఈమేరకు పాఠశాలలకు వెళ్లడం లేదా ఇళ్లకు వెళ్లి తల్లిదండ్రులకు పలు దఫాలు వివరిస్తేనే ఫలితం వస్తుంది. ఇప్పుడు బడిబాటతో కలిపి హాస్టల్ బాట నిర్వహిస్తుండడంతో ప్రవేశాలు పెరుగుతాయా, లేదా అన్న మీమాంస నెలకొంది. ఈ విషయంలో ఉన్నతాధికారులు పునరాలోచన చేయాలని విద్యార్థి సంఘాల నాయకులు కోరుతున్నారు.

వేతనాల కోసం హైదరాబాద్‌లో ఆందోళన



ధర్నాలో కార్మికులు, నాయకులు

ఖమ్మం మామిళ్లగూడెం: జిల్లా ప్రభుత్వాస్పత్రిలో పనిచేస్తున్న కాంట్రాక్ట్ కార్మికులకు మూడు నెలలుగా వేతనం చెల్లించకపోవడంతో కొద్దిరోజులుగా విధులు బహిష్కరించి సమ్మె చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం టీయూసీఐ, టీఐటీయూ ఆధ్వర్యాన కార్మికులు హైదరాబాద్‌లో వైద్య విధాన కార్యాలయం ఎదుట ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ రాష్ట్ర నాయకులు కుమార్, టీయూసీఐ రాష్ట్ర ఉపాధ్యక్షుడు అన్వేష్ మాట్లాడుతూ జిల్లాలో ముగ్గురు మంత్రులు ఉన్నా ఆస్పత్రి కార్మికులకు వేతనాలు చెల్లించకోవడం గర్హనీయమన్నారు. వేతనాలు అందే వరకు సమ్మె కొనసాగుతుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా అధ్యక్షుడు తుమ్మ విష్ణువర్ధన్, టీయూసీఐ జిల్లా కార్యదర్శి జి.రామయ్య, నాయకులు కె.శ్రీనివాస్, విజయమ్మ, అంబేద్కర్, వెంకటరమణ, జగదీష్, రాములమ్మ, అశోక్, హరీష్, మమత, రాధమ్మ పాల్గొన్నారు.

కనిపించని మావోల బంద్ ప్రభావం

దుమ్ముగూడెం/చర్ల: మావోయిస్టు పార్టీ జాతీయ కార్యదర్శి నంబాల కేశవరావు ఎన్‌కౌంటర్‌కు నిరసనగా తలపెట్టిన భారత్ బంద్ ప్రభావం ఏజెన్సీ ప్రాంతమైన దుమ్ముగూడెం, చర్ల మండలాల్లో కనిపించలేదు. దుకాణాలు, ప్రభుత్వ కార్యాలయాలు యథావిధిగా కొనసాగాయి. ఆటోలు, బస్సులు మామూలుగానే నడిచాయి. పోలీసులు మాత్రం అప్రమత్తమై ప్రధాన రహదారుల వెంట ముమ్మర తనిఖీలు చేపట్టారు. చర్ల మండలంలో ముందస్తుగా కట్టడి చేసి బంద్‌లో ఎవరూ పాల్గొనకుండా చర్యలు చేపట్టారు. దుమ్ముగూడెంలో సీఐ అశోక్ ఆధ్వర్యంలో వాహన తనిఖీలు చేపట్టి అనుమానితుల వివరాలు ఆరా తీశారు. అలాగే, ఛత్తీస్‌గఢ్ సరిహద్దు గ్రామాల్లో ప్రత్యేక బలగాలతో గాలింపు చర్యలు చేపట్టారు.